ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 5, 2003

గోదావరి బహుళార్థ వినియోగం

అభివృద్ధికి సోపానం

హ్యాపీ బర్త్‌డే

(5-1-2003 నుండి 11-1-2003 వరకు)

అర్పిత కుమారి(దివ్యవాణి)
3సం॥, 5. 1. 2000
నాగనా(లత)-నర్సిమ్మాచారి
మల్కాజ్‌గిరి-సికింద్రాబాద్



సింధూర
జనవరి 5
వాణిశ్రీ-సురేందర్
మాసాయిపేట్-మెదక్

లావణ్య
3సం॥,5. 1. 2000
అనిత కుమారి-నరహరిచారి
మల్కాజ్‌గిరి- సికింద్రాబాద్

లాహరి కుమారి
2సం॥, 5. 1. 2001
అనిత-నవీన్‌కుమార్ చారి
మల్కాజ్‌గిరి-సికింద్రాబాద్

1సం॥, 5. 1. 2002
రేవతి-చంద్రన్న
సుందరయ్య నగర్-ఆదిలాబాద్

నాగని దివ్యజ్యోతి
2సం॥, 5.1.2001
విజయలక్ష్మి-వెంకటయ్య
తోళ్లపల్లి-రంగారెడ్డి

బోడేపూడి నిర్గుణ్ కుమార్
జనవరి-6
శ్రీలక్ష్మి-రాహుల్
రామన్నపేట

కె.రమ్య
9సం॥, 6. 1. 1994
జయలక్ష్మి- సత్యారావు
నర్సన్నపేట-శ్రీకాకుళం

అరవింద్‌కుమార్
6సం॥, 7. 1. 1997
జయశ్రీ-బస్వరాజ్
న్యాల్‌కల్-మెదక్

బి.కె.ఎల్. కావ్య
భారతి-లోకనాథం
కన్నావరం-చిత్తూరు

జి.శివప్రసాద్
3సం॥, 7.1.2000
అనసూయ-పెంటయ్య
మేడిపల్లి-రంగారెడ్డి

...పిల్లలను బడికి పంపకూడదు. ఇంట్లో కూడా ఇతర పిల్లలకు దూరంగా వుంచడం మంచిది. మీజిల్స్‌నే 'రూబియోలా' అని కూడా అంటారు. 1911వ సంవత్సరంలో మీజిల్స్ వైరస్ వల్ల వస్తుందని కనుగొన్నారు. 1954లో మీజిల్స్ కారక వైరస్‌ను డా॥ యండర్స్, పీబ్లెస్‌ల వైద్య బృందం గుర్తించింది. 1963 నుండి మీజిల్స్ వ్యాధిని సమర్థవంతంగా నిరోధించే వ్యాక్సిన్ లభ్యమవుతున్నది. వ్యాక్సిన్ ప్రవేశంతో మీజిల్స్ వ్యాధి నిరోధంలో ప్రపంచం గణనీయమైన విజయం సాధించింది. 1960 సంవత్సరం ప్రాంతంలో ప్రపంచ వ్యాప్తంగా 13.5 నుంచి 14 కోట్ల మంది వ్యాధి బారిన పడుతుండగా 70 నుండి 80 లక్షలమంది పిల్లలు మరణించేవారు. వ్యాక్సిన్ వచ్చాక ప్రస్తుతం వ్యాధికి గురవుతున్న వారి సంఖ్య 4.2 కోట్లకు, మరణిస్తున్న వారి సంఖ్య 10 లక్షలకు తగ్గిపోయింది. 1990 నుండి మన దేశంలోనూ మీజిల్స్ వ్యాధి తగ్గు ముఖం పట్టింది. 1989లో మన దేశంలో 1,62,560 కేసులు గుర్తించగా, ఆ సంఖ్య 1995 నాటికి 26,986కు తగ్గింది. మరణాలు బాగా తగ్గిపోయాయి. మీజిల్స్ వ్యాధి వేసవికాల ప్రారంభంలో ఏటా కనబడుతోంది. ముఖ్యంగా జనవరి-ఏప్రిల్ నెలల్లో వైరస్ ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. ఆయా నెలల్లో గల వాతావరణ మార్పులు వైరస్ వ్యాప్తికి అనుకూలమేమోనన్న అభిప్రాయాన్ని వైద్య నిపుణులు వ్యక్తపరుస్తున్నారు. అయితే సాధారణ ఉష్ణోగ్రత వద్ద, అతినీలలోహిత కిరణాలలోను, పార్మాల్డిహైడ్, ఈథర్ వంటి రసాయనాలలోను మీజిల్స్ వైరస్ కొద్ది క్షణాలలో క్రియారహితమవుతుంది.

వ్యాక్సిన్ ఎలా తీసుకోవాలి ?

మీజిల్స్ వైరస్‌ను కల్చర్ చేయడం ద్వారా సంఖ్యాభివృద్ధి పరిచి, ఆ వైరస్ క్రియాత్మకతను తగ్గించడం ద్వారా వ్యాక్సిన్‌ను రూపొందించడం జరుగుతున్నది. ఈ వ్యాక్సిన్‌ను పిల్లలకు 9-12 నెలల మధ్య వయస్సులో సబ్క్యుటేనియస్‌గా (చర్మం కిందకు) ఇంజక్షన్ రూపంలో ఇస్తారు.

తొమ్మిది నెలల వయస్సు వరకు తల్లి నుంచి సంక్రమించిన వ్యాధి నిరోధక శక్తి పిల్లల్ని మీజిల్స్ వైరస్ నుండి రక్షిస్తుంది. అందువల్లనే 9 నెలల తరువాత మీజిల్స్ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఎం.ఎం.ఆర్. వ్యాక్సిన్ కూడా ప్రాచుర్యాన్ని పొందుతున్నది. ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇవ్వడం లేదు. అయితే "సిరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా లిమిటెడ్" ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎం.ఎం.ఆర్. వ్యాక్సిన్‌ను నామమాత్రపు ధరకే అందిస్తోంది. ఈ వ్యాక్సిన్‌ను సంవత్సరం నుండి 21సంవత్సరాల మధ్య వయస్కులు అందరూ తీసుకొనవచ్చు. ముఖ్యంగా ఆ వయసులో గల స్త్రీలు తప్పనిసరిగా తీసుకోవాలి. దీనివల్ల మీజిల్స్, మమ్స్, రుబెల్లా వంటిమూడు ప్రమాదకర వైరస్ వ్యాధుల నుండి సమాజం రక్షించబడుతుంది. వ్యాక్సిన్ తీసుకున్నప్పుడు కొద్దిపాటి జ్వరం రావచ్చు. రాష్ కనిపించవచ్చు. దీనివల్ల ఎలాంటి నష్టం వాటిల్లదు. జీవితాంతం "వ్యాధినిరోధక శక్తి" వ్యాధుల నుండి కాపాడుతుంది. వ్యాక్సిన్ తీసుకున్న వారిలోనూ, మీజిల్స్‌కు గురైన వారిలోనూ మరోసారి వ్యాధికి గురి కావడం చాలా అరుదని చెప్పాలి. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నిరోధించాలి. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. తద్వారా మీజిల్స్ వ్యాప్తిని అరికట్టాలి. ◆

సూర్యరశ్మినుండి చర్మం రక్షణ

శరీర అవయవ భాగాలన్నిటిలోనూ చర్మం ముఖ్యమైన ఇంద్రియం చర్మము 19,000 చదరపు సెంటీమీటర్ల మేర శరీరభాగాన్ని కప్పి ఉంది. వివిధ రకాల అంటురోగాలు, వేడి నుండి చర్మం రక్షిస్తుంది. ఒక వైపు శరీరానికి భద్రత కలిగిస్తూ చెమటను విసర్జించడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేస్తుంది. ఎక్కువసార్లు ఈ కిరణాలు మానవునికి ఉపయోగకరంగానే ఉన్నాయి. ఉదా : విటమిన్ డి శరీర ఆరోగ్య పరిరక్షణకు అవసరమైనది. చర్మం సూర్యరశ్మికి లోనగుటవలననే విటమిన్ డి శరీరానికి లభిస్తుంది. విటమిన్ డి లేమి వలన (డెఫిషియన్సీ) చివరకు అది రికెట్స్ అనే వ్యాధికి కారణమౌతోంది. అలా అని ప్రత్యక్షంగా సూర్యరశ్మికి గురి కావడం అనేది అన్ని వేళలా మంచిదికాదు. ఇది అనేక రకాలుగా చర్మానికి హాని కలిగిస్తుంది. వేసవిలో చెమట పొక్కులు సర్వసాధారణం. చల్లని ప్రదేశాలలో నివసించటం, టాల్కంపౌడర్లు, తరచుగా స్నానం చెయ్యడం ద్వారా వీటిని దూరంగా ఉండవచ్చు. సోలార్ కెరటైటిస్ అనేది మెడికల్ పదం. దీనివలన శరీరం పగిలినట్లు అవడం, గజ్జి, శరీరానికి హాని కలిగించే మచ్చలు తల, మెడ, చేతులు వెనుక భాగంలో వస్తాయి. ఈ భాగాలన్నీ పైన ఎర్రగా గరుకుగా ఉంటాయి. పేలడం, దద్దుర్లు మొదలగునవి అరుదుగా హాని కలిగించేవి. ఇలాంటి రాష్ కొందరిలో కొన్ని మందులు వాడటం వలన తగ్గవచ్చు. నున్నితమైన చర్మంగలవారు ఎక్కువ శాతం సూర్యరశ్మికి గురి అవడం వలన చర్మ కాన్సర్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కాని ఈ వ్యాధి అదృష్టవశాత్తు చాలా తక్కువ శాతం ప్రపంచంలో ఉంది. గొడుగు ఉపయోగించడం, ఇంటికి రాగానే స్నానం చెయ్యడం మొదలగు జాగ్రత్తలు పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చు. ఎక్కువరోజులు బాధ కలిగించే చర్మ సమస్యలు ఉన్నట్లయితే డెర్మలాజిస్ట్ సలహా తీసుకోవడం అతి ముఖ్యమైన విషయం. ◆

అంపశయ్య నవీన్

నవలగా చరిత్ర

"ఈ మధ్య మీరు మరీ బిజీగా కనిపిస్తున్నారు. ఏమిటి విశేషం" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"విశేషాలకేం? చాలానే ఉన్నాయి. మొన్ననే మా మిత్రుడు, విశ్వవిఖ్యాత ధ్వన్యనుకరణ సమ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన డా॥ నేరెళ్ళవేణుమాధవ్ డెబ్బయ్యవ జన్మదిన వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. ఆయనకు ఆయన శిష్యులతోనూ, అభిమానులతోనూ ఎంత ఆత్మీయమైన సంబంధం ఉందో మొన్నటి ఆయన జన్మదిన వేడుకలు వ్యక్తపరచాయి. ఆ కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఎంతోకొంత నా వంతు బాధ్యతను నేనూ నిర్వహించాను.

ఆ కార్యక్రమం జరగడానికి నాలుగు రోజుల ముందుగా నేను ఇటీవలనే రాసిన ఓ పెద్ద నవలను విడుదల చేసే కార్యక్రమం జరిగింది" అన్నాను.

"అవును.. మీరు నన్ను కూడా ఆ కార్యక్రమానికి ఆహ్వానించారు. కానీ ఆ రోజు నేను అనుకోకుండా ఓ ఊరెళ్ళాల్సి రావడం వల్ల నేనా ప్రోగ్రాంకు రాలేకపోయాను. మీరు ఇటీవలనే రాసి, ప్రచురించి, విడుదల చేసిన ఆ నవలను గూర్చి కాస్త చెప్పండి" అన్నాడు పుల్లారావు.

"చెప్పడం కంటే మీకు నేనా నవలిస్తాను హాయిగా చదువుకొని ఆనందించండి"

"మీరు నాకోసారి ఆ నవలను చూపించారు - దాన్ని చూస్తేనే భయమేసింది. ఆరు వందల పేజీల నవల... దాని పేరు 'కాలరేఖలు' అని కూడా గుర్తుంది. అంత పెద్ద నవల్ని ఈ రోజుల్లో ఎవరన్నా చదువుతున్నారంటారా? నేనైతే చదవలేను. నా చూపే అంతంతమాత్రం.. అంత పెద్ద నవల రాయడానికి మీకెంత టైమ్ పట్టిందో..."

"గత ఐదేళ్ళుగా నేనా నవల మీద వర్క్ చేస్తున్నాను. ఈ నవల రాయడానికి నాకు కొంత పరిశోధన కూడా అవసరమయ్యింది. నేను రాసిన ఈ "కాలరేఖలు" నవలని చారిత్రాత్మక నవల అనొచ్చు. పందొమ్మిది వందల నలభైలలో మన తెలంగాణాలో ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచాన్నంతా ఓ ఊపు ఊపేసిన తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం నలభైలలోనే.. ముఖ్యంగా 1944 నుండే జరిగింది. 1944లో పదకొండో ఆంధ్రమహాసభ జరిగింది. అంతకుముందు జరిగిన పది ఆంధ్ర మహాసభలకు, ఈ పదకొండో ఆంధ్రమహాసభకు ఒక మౌలికమైన వ్యత్యాసం ఉంది. అదేమిటంటే : ఈ పదకొండో ఆంధ్రమహాసభ పూర్తిగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో.. ఆ పార్టీ నాయకుడు రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. అప్పటి నైజాం రాజు.. అతని తాబేదార్లయిన దొరలు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు... సామాన్య ప్రజానీకాన్ని ముఖ్యంగా బడుగు వర్గాల వారిని ఎన్నో రకాలుగా పీడించి పిప్పి చేస్తుండేవాళ్ళు. వాళ్ళ అమానుష పీడనకూ, దోపిడీకి వ్యతిరేకంగా అప్పటి కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభ పేరుతో ప్రజల్ని సమీకరించింది. అప్పటి తెలంగాణా పల్లెల్లో ఆంధ్రమహాసభను 'సంగం' అంటుండేవాళ్ళు. నేను పుట్టి పెరిగిన జనగాం తాలుకాలోని వావిలాల గ్రామానికి చుట్టుపక్కలుండే అనేక గ్రామాల్లో పదకొండో ఆంధ్ర మహాసభను గూర్చి ప్రజలకు తెలియజేయడానికి అనేక సమావేశాలు జరిగాయి. మా ఊర్లో కూడా అలాంటి సమావేశమొకటి జరిగింది. ఆ సమావేశానికి ముందు ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావి నారాయణరెడ్డిని, బద్దం ఎల్లారెడ్డిని, ఆరుట్లరామచంద్రారెడ్డిని పదకొండు జతల యెడ్లను కట్టిన బండిమీద కూర్చోబెట్టి పోరాట పాటలు పాడుతూ ఊరేగించారు. ఆ ఊరేగింపును నేను చూశాను. అప్పుడు నాకు నాలుగేళ్ళు. అదే నా మొట్టమొదటి జ్ఞాపకం. ఈ సంఘటన, ఆ తర్వాత మా ఊరి చుట్టు పక్కల గ్రామాల్లో జరిగిన అనేక సంఘటనలు నా స్మృతి పథంలో ఈనాటికీ, ఏ నాటికీ చెరిగిపోకుండా నిలిచిపోయాయి. ఆనాటి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైంది మా ప్రాంతంలోనే... మా ప్రాంతంలోని అనేక గ్రామాలు.. ముఖ్యంగా కడివెండి, దేవరుప్పుల, మొండ్రాయి, విస్నూరు, పాలకుర్తి మొదలైనవే ఆనాటి పోరాటానికి కేంద్రాలు. ఆంధ్రమహాసభ మొదట్లో దొరలు, జమీందార్ల నిరంకుశత్వానికీ, దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా పోరాటం చేసింది. ఆ తర్వాత 1947 నుండి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసింది. ఎన్నో గ్రామాలను రజాకార్ల ఊచకోత నుండి రక్షించింది. ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ అన్నమాట అస్సలే వినిపించేది కాదు.. మొదట్లో ఆంధ్రమహాసభ... తర్వాత సంగం... కమ్యూనిస్టు పార్టీ వాళ్ళు వస్తున్నారంటే సంగపోల్లు వస్తున్నారంటుండేవాళ్ళు. ప్రజలకూ, సంగపోల్లకు చాలా ఆత్మీయమైన సంబంధం ఏర్పడింది. సంగపోల్లంటే 'మనవాళ్ళు' అనే భావం ఆనాటి ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయింది. మా గ్రామానికి చాలా దగ్గర్లో ఉండే కడివెండి గ్రామానికి చెందిన సంగం నాయకుడు నల్ల నరసింహను గూర్చి ప్రజలు ఎన్నో కథలు చెప్పుకునే వాళ్ళు. హీ వాజ్ ఎ లిజెండ్... మా ఊరికొక్కూడా నల్ల నరసింహ ఒకసారొచ్చాడు.. అతన్ని చూడటం అంత చిన్నప్పుడే నాకో అద్భుతమైన అనుభూతిగా, గొప్ప థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌గా నా అంతరాంతరాల్లో నిలిచిపోయింది. నేనే నవలా కారుడిగా స్థిరపడ్డాక నా ఈ చిన్నప్పటి ఈ అనుభవాలనన్నింటినీ, ఆనాడు నేను చూసిన పోరాట దృశ్యాల నన్నింటినీ చిత్రిస్తూ ఓ నవల రాయాలని నిర్ణయించుకున్నాను. ఈ నవలకు సంబంధించిన ఇతివృత్తం నా మైండ్‌లో ఇరవయ్యేళ్ళుగా నలిగిపోతున్నది. నేను చేస్తున్న ప్రభుత్వోద్యోగం నుండి విముక్తి లభిస్తే తప్ప నేనీ నవలను రాయలేననుకున్నాను. 1996లో నేను పదవీ విరమణ చెయ్యగానే నేనీ నవలను మొదలెట్టాను. అదిప్పటికి అంటే 2002 నాటికి పూర్తయ్యింది. ఈ నవలలో నేను యాభయ్యేళ్ళ తెలంగాణా చరిత్రను ఒక నవలగా మలచే ప్రయత్నం చేశాను. అయితే దీన్ని ఒక పుస్తకంగారాస్తే మరీ పెద్దదైపోతుందన్న భయంతో మూడు పుస్తకాలుగా... అంటే మూడు నవలలుగా రాశాను. ఆ మూడింట్లో మొదటిదే ఈ 'కాలరేఖలు'. దీంట్లో 1944 నుండి 1956 వరకు తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైనప్పట్నించి, ముక్కలు చెక్కలుగా విడిపోయిన, తెలుగువాళ్ళందరూ 1956లో 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రంగా సమైక్యమయ్యే వరకు 'కాలరేఖలు' నవల సాగుతుంది. తర్వాత 1956 నుండి 1969 వరకు 'చెదిరిన స్వప్నాలు' అనే పేరుతోనూ, 1970 నుండి ఇంచుమించు ఇప్పటి వరకు 'బాంధవ్యాలు' అన్న నవలలోనూ చిత్రించాను. 'బాంధవ్యాలు' నవల కూడా వెలువడింది. ఒక్క 'చెదిరిన స్వప్నాలు' అన్న నవల వెలువడవలసి ఉంది. అది కూడా త్వరలోనే వెలువడుతుంది" అన్నాను. "చాలా బ్రహ్మాండమైన కృషే మీది. ఇంత పెద్ద నవలల్ని ఎవరన్నా చదువుతుంటారా?"

"నవలల్ని ఇదివరకు చదివినట్లుగా టీవీల కారణంగా చదవడం లేదు అనే మాట కొంతవరకు నిజమే అయినప్పటికీ మంచి నవలల్ని చదివే పాఠకులు ఇప్పటికీ ఉన్నారనేది నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్న వాస్తవం. నాదో కొత్త నవల వెలువడిందంటే నాకొస్తున్న ఫీడ్ బాక్ నాకు చాలా ఉపశమనాన్ని కలిగిస్తోంది" అన్నానేను. ◆

ఈ జట్టు ప్రపంచకప్ తెచ్చేనా?

ఎం.డి.హసన్ షరీఫ్

ఐసిసి, బిసిసిఐల స్పాన్సర్‌షిప్ వివాదాల నడుమ ప్రపంచకప్‌కు భారత క్రికెట్ జట్టును ప్రకటించారు. ప్రపంచకప్ తెచ్చే బాధ్యతను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు పాత ఆటగాళ్లపైనే వేసింది. అయితే ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలమైన దక్షిణాఫ్రికాలో భారత ఆటగాళ్ల ఎత్తులు ఫలిస్తాయా? ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పాకిస్తాన్ వంటి జట్లలో గల ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొనే సత్తా మన ఆటగాళ్లకు ఉందా? ప్రపంచంలోనే ఉత్తమ బ్యాట్స్‌మెన్లతో కూడిన భారత్ ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలోనే చతికిల పడుతోంది. న్యూజిలాండ్ పిచ్‌లకు దక్షిణాఫ్రికా పిచ్‌లకు దగ్గరి పోలిక ఉంటుంది. మరి ఇక్కడ చతికిల పడిన భారత బ్యాట్స్‌మెన్ దక్షిణాఫ్రికాలో ఎలా రాణిస్తారు? బ్రాడ్‌మన్ తర్వాత అంతటివాడు సచిన్ టెండూల్కర్, ప్రపంచకప్‌లో ఉత్తమ బ్యాటింగ్ టెక్నిక్ కలిగిన రాహుల్ ద్రావిడ్, సంచలనాలు సృష్టించే సత్తాగల యువరాజ్ సింగ్, వీరేందర్ సెహవాగ్, మహ్మద్ కైఫ్ వంటి బ్యాటింగ్ హీరోలు గల మన జట్టుపై ప్రపంచకప్ ఆశలు పెట్టుకోవడంలో తప్పులేదు. కానీ వాళ్ల నిలకడలేని ఆటతీరే కలవరపరుస్తోంది. అందరూ ఉత్తమ బ్యాట్స్‌మెన్లే కానీ ఎవరూ అవసరానికి పనికిరారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఇదే కొనసాగుతోంది. ఆల్‌రౌండర్లు లేని కొరత కూడా జట్టును వేధిస్తోంది. ప్రపంచకప్‌కు కూడా సంజయ్ బంగర్ ఒక్కడే ఆల్‌రౌండర్. అతనికి కూడా ఎక్కువ అనుభవం లేదు. గంగూలి, సచిన్, అగార్కర్, యువరాజ్ సింగ్‌లను కూడా ఆల్‌రౌండర్లుగా పరిగణించవచ్చు. కానీ వాళ్లు బౌలింగ్‌తో మ్యాచ్‌లను గెలిపించిన ఉదాహరణలు లేవు. అయినా ప్రధాన ఆయుధమైన బ్యాటింగ్‌లోనూ వాళ్లు రాణించకుంటే జట్టు గెలుపొందడం అసాధ్యమే. న్యూజిలాండ్ పర్యటనలో ఎవరూ సరిగా రాణించలేక పోతున్నారు. ప్రపంచంలోనే ఉత్తమ బ్యాటింగ్ లైనప్ కలిగిన జట్టు తమదే అని గతంలో చాటిచెప్పిన భారత్ ప్రస్తుతం ప్రపంచంలో పేలవమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన జట్టుగా మారింది. ఆల్‌రౌండర్లు ఎక్కువమంది ఉంటేనే ప్రపంచకప్ గెలవగలమని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సంవత్సరం క్రితమే చెప్పాడు. భారత్ ఆల్‌రౌండర్లను వెతికి శిక్షణ ఇవ్వాలని సూచించాడు కూడా. కానీ ఆ వైపుగా బిసిసిఐ కనీసం ఆలోచన కూడా చేయలేదు. ఫాస్ట్ బౌలింగ్ బాధ్యత ప్రధానంగా జహీర్ ఖాన్, జవగళ్ శ్రీనాథ్‌లపై పడింది. జహీర్ తన పరిధిలో బాగానే రాణిస్తున్నాడు. కానీ చివరి ఓవర్లలో మరిన్ని వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టుపై భారం వేయగలిగినప్పుడే అతను జట్టును గెలిపించగల సత్తాగల వాడుగా నిరూపించుకో గలుగుతాడు. అగార్కర్ బౌలింగ్‌లో నిలకడ లేని తనం వేధిస్తోంది. అతను ఒక మ్యాచ్‌లో బౌలింగ్‌లో రాణించి జట్టును గెలిపిస్తే, మరో మ్యాచ్‌లో తన బౌలింగ్‌తోనే జట్టును ఓడిస్తాడు. ఈ ధోరణి మారాలి. సీమర్లకు అనుకూలించే దక్షిణాఫ్రికా పిచ్‌లపై బ్యాట్స్‌మెన్‌తో పాటు జహీర్, శ్రీనాథ్, అగార్కర్‌లు రాణించే విధానాన్ని బట్టే విజయావకాశాలుంటాయి. ఫాస్ట్ పిచ్‌లపై అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్‌ల స్పిన్ ఎక్కువగా పనిచేయదు. అదీకాక మన స్పిన్నర్లు విదేశాల్లో అంతగా రాణించిన రికార్డు లేదు. కానీ మన స్పిన్నర్లు అంటే విదేశీ బ్యాట్స్‌మెన్‌కు ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌కు హడల్.



సచిన్, యువరాజ్, జహీర్‌లపైనే జట్టు భారం

దీంతో వారిపై మన స్పిన్నర్లు మానసికంగా ఆధిపత్యం వహించి సాధ్యమైనన్ని పరుగులు ఆపగలగాలి. వారు తమ స్పిన్‌కు మరింత పదును పెట్టినప్పుడే అది సాధ్యం. వికెట్ కీపర్‌గా రాహుల్ ద్రావిడ్ బాగానే రాణిస్తున్నప్పటికీ దాని ప్రభావం బ్యాటింగ్‌పై పడే ప్రమాదం ఉంది. కీపింగ్ ద్వారా అలసిపోయిన ద్రావిడ్ బ్యాటింగ్‌లో రాణించే అవకాశాలు సన్నగిల్లుతాయి. దీంతో అతను బ్యాటింగ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టి కీపింగ్ బాధ్యతలు పార్థివ్ పటేల్‌కు అప్పగించాలి. ఇటీవల సరిగా రాణించలేకపోతున్న వి.వి.ఎస్.లక్ష్మణ్ స్థానంలో దినేశ్ మోంగియాను ఎంపిక చేయడంలో సెలెక్టర్ల ఉద్దేశ్యమేంటో అర్థం కావడం లేదు. ఏ విధంగా చూసినా లక్ష్మణ్ కంటే మోంగియా మెరుగైన బ్యాట్స్‌మన్ కాదు.



డబ్బుపై నుండి దృష్టిని ఆటపైకి మరల్చాలి

వంద కోట్ల జనాభా గల భారత్‌లో క్రికెట్ అభిమానులు కోకొల్లలు. మన ఆటగాళ్లను వారు హీరోలుగా భావిస్తారు. ప్రపంచకప్‌ను ఆసరాగా చేసుకొని లాభాలు గడించాలని బహుళ జాతి కంపెనీలు పోటీపడుతున్నాయి. లాభాపేక్ష కారణంగా ఆటగాళ్లకు క్రికెట్ సంఘాలతో (ఐసిసి, బిసిసిఐ) వివాదం ఏర్పడింది. క్రికెట్ అభివృద్ధి విషయంలో కాకుండా స్పాన్సర్ షిప్ ద్వారా వచ్చే లాభాన్ని పంచుకునే విషయం వివాదాస్పదంగా మారడం క్రికెట్‌కు చేటుతెచ్చే విషయం. దీంతో ఆటగాళ్ల ఏకాగ్రత మ్యాచ్‌పై కాకుండా డబ్బుపై మళ్లింది. ఈ కారణం చేత వారు సరిగా ఆడలేకపోతున్నారు. ఈ ధోరణి క్రికెట్ అభివృద్ధికే ప్రమాదకారి. భారత ఆటగాళ్లు ముఖ్యంగా సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలి, రాహుల్ ద్రావిడ్, వీరేందర్ సెహవాగ్, అనిల్ కుంబ్లేలపై ప్రస్తుతం భారత అభిమానులకు విపరీతమైన క్రేజీ. దీంతో వారు ఆటల ద్వారానే కాకుండా స్పాన్సర్‌షిప్‌ల ద్వారా కూడా కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఆటగాళ్లు దృష్టిని ఆటపై కాకుండా డబ్బుపై పెడ్తే వారి ఆటతీరు సన్నగిల్లుతుంది. దీంతో ఆదరించే అభిమానుల చీత్కారాలకు కూడా గురికావాల్సి వస్తుంది.

ఎడతెరిపిలేని క్రికెట్ కారణంగా కూడా ఆటగాళ్లకు ఆటపై ఆసక్తి తగ్గుతోంది. ముఖ్యంగా ఆటగాళ్లు తాము చేస్తున్న తప్పులను సమీక్షించుకోకుండా మరో మ్యాచ్‌లో పాల్గొంటున్నారు. దీంతో వారు చేసిన తప్పులే చేస్తూ వరుస పరాజయాలను ఎదుర్కొంటున్నారు. న్యూజిలాండ్‌లో ఇదే జరుగుతోంది. మ్యాచ్ పూర్తయిన తర్వాత తప్పులను సమీక్షించుకొని ఆ తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా కృషి చేయాలి. దేశంలో ఫాస్ట్ పిచ్‌లను నెలకొల్పాలని కపిల్ దేవ్ ఇచ్చిన పిలుపును బిసిసిఐ ఖాతరు చేయలేదు. ప్రపంచకప్ ప్రారంభానికి ముందు నిర్వహించే శిక్షణా శిబిరంలోనైనా ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనే తీరుపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే ప్రపంచకప్‌పై మనం ఆశలు పెట్టుకో గలుగుతాం. ◆

రాణీపులోమజాదేవి

బ్యాన్ ది డౌరీ

ఆ రోజు ప్రతిరోజు కన్నా ప్రత్యేకంగా అనిపిస్తూంది యామిక మనసుకు. టీనేజీ ఆఖరు అధ్యాయంలో ఉందామె. ఫ్రెష్‌గా కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, జీవితంలో తరువాయి అంకమైన పెళ్ళి అనే ఆలోచనకు నాందీ పలికే రోజది. తొలిసారిగా పెళ్ళిచూపులు. అబ్బాయి అందగాడట. స్టేట్ గవర్నమెంట్ జాబ్ చేస్తున్నాడట. తల్లిదండ్రులు, ఓ తమ్ముడు మాత్రమే ఉన్నారట. ఈ సంబంధం కుదిరితే తను అదృష్టవంతురాలేనని మురిసిపోతున్నారు తన తల్లిదండ్రులు. బాధ్యతలే లేని సంబంధం మరి. అందులోనూ జాతకాలు కలవడంతో మరింత ముందుకెళ్ళిపోయాయి వాళ్ళ ఆలోచనలు. అన్నయ్య, చెల్లెలు ఆటపట్టిస్తుంటే, విసుక్కున్నట్లు నటిస్తూనే ఊహాలోకంలో తేలిపోతోంది యామిక. తన స్నేహితురాళ్ళందరూ తను అందంగా ఉంటుందనే అంటారు. కాబట్టి ఆ అబ్బాయికి తాను నచ్చకపోయే ప్రసక్తేలేదు. సిగ్గుపడుతూనే అందంగా అలంకరించుకొంది యామిక.

హడావిడిగా ఫలహారాలు తయారు చేస్తోంది అమ్మ. చక్కగా అలంకరించిన గదినే వేరువేరు కోణాల్లోంచి చూస్తూ తనివి తీరక మార్పులు చేస్తూనే ఉంది చెల్లి. పెళ్ళివారి రాకకోసం ఎదురు చూస్తూ హడావుడిగా వాకిట్లోకి ఇంట్లోకి తిరుగుతున్నారు నాన్న, అన్నయ్య. ఆటో వచ్చి ఆగిన శబ్దమవుతూనే గుండె కొట్టుకోవడం స్పష్టంగా వినపడినట్లయింది యామికకు. వెచ్చని ఆవిరి ముఖమంతా చిమ్మింది.

'అక్కయ్యా! వాళ్ళొచ్చేశారే!' అంటూ పరుగెత్తుకొచ్చింది చెల్లి.

'అయితే ఏం చెయ్యమంటావే?' అంటూనే తర్వాతి వివరాల కోసం ఎదురు చూసింది ఆత్రంగా. 'పోవే! బావను గురించి చెబ్దామని వస్తే, నువ్వేమో నన్ను కసిరేస్తావు. నేను అమ్మ దగ్గరికి పోతాన్లే!' కోపం నటిస్తూ వెళ్ళబోయింది చెల్లి.

'లేదు లేవే! మా బంగారు తల్లి కదూ! సారీ అన్నానుగా! నీకు బుద్ధిపుడితే చెప్పు. లేకుంటే లేదు'.

'అయితే నీకేం ఇంటరెస్ట్ లేదంటావు. పోనీలే! నేను చెబుతాను. బావగారు చాలా ఛార్మింగ్‌గా ఉన్నారే! అచ్చు సినిమాలో హీరోలా ఉన్నారు'.

ఒక్కసారిగా మనసు పులకరించినట్లయింది యామికకు. తానెంత అదృష్టవంతురాలు.

పెళ్ళివారికి టిఫిన్లు, కాఫీలు ఇవ్వడం అయినట్లుంది. అమ్మ లోపలికొచ్చి యామికను పిల్చుకొని ముందు గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టింది. తలవంచుకొని కూర్చొని ఉన్నా అందరి దృష్టి తనమీదే ఉందని గుర్తొస్తూనే తడబాటుగా అనిపిస్తూంది. అతడి తల్లి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ఒక్కసారి తలెత్తి చూసింది. సరిగ్గా అదే సమయంలో తననే చూస్తున్న అతడి చూపులతో చూపులు కలుస్తూనే తడబాటుగా తల తిప్పేసింది.

'ఇక అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళవచ్చుని' చెబుతూనే లోపలికొచ్చేసింది. త్వరలో ఏ విషయమూ తెలియజేస్తామని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

'వాళ్ళ మాటల్ని బట్టి చూస్తే అమ్మాయి నచ్చినట్లే ఉంది కదండీ!' అంటోంది అమ్మ.

'నిజమేనే! అబ్బాయి కూడా ఎంత బుద్ధిమంతుడో! పెద్దలంటే మంచి గౌరవమున్నట్లుంది' అంటున్నారు నాన్నగారు.

నవ్వొచ్చింది యామికకు. 'ఆ కాసేపట్లో అబ్బాయి గుణాన్ని ఎల్లా గుర్తించగలిగారో నాన్నగారు'.

'అమ్మాయ్ యామికా! వెళ్ళేటప్పుడు నీకు చెప్పమన్నారు నీకు కాబోయే అత్తగారు' దాదాపు సంబంధం సెటిలైనట్లే చెప్పేస్తోంది అమ్మ!

తనకూ నిజమేననిపిస్తోంది. అతడి చూపుల్లో తను నచ్చినట్లే అనిపిస్తోంది.

వారం రోజులూ సుదీర్ఘంగా గడిచిపోయాయి. ఓ వ్యక్తి నచ్చిందా! లేదా! చెప్పడానికి ఇన్ని రోజులా అనుకుంది యామిక.

'మరేమనుకున్నావ్, మగపెళ్ళివారంటే. ఆ మాత్రం బెట్టు చూపొద్దూ! అది ఆనవాయితీ' అమ్మ మాటలు విని సంప్రదాయాలన్నిటినీ ఇలాగే తయారు చేశారేమో! అనుకుంది యామిక.

ఆ రోజు మధ్యవర్తి వచ్చి, అమ్మాయి వారికి నచ్చిందనీ, ఇక కట్నం లాంఛనాల విషయం మాట్లాడటానికి రమ్మన్నారనీ చెప్పాడు. మంచి ముహూర్తం చూసుకొని, అమ్మా, నాన్నా వాళ్ళింటికి వెళ్ళారు. సాయంత్రానికి తిరిగి వచ్చిన వారి ముఖంలో అంత ఆనందం, ఉత్సాహం వ్యక్తం కాకపోవడంతో ఆందోళన కలిగింది యామికకు.



మధ్యవర్తి మాటల ప్రకారం వారు దాదాపు యాభైవేలు కట్నం అడగవచ్చుని అనుకొని అందుకు సిద్ధమై ఈ పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు యామిక తల్లిదండ్రులు. తీరా ఇప్పుడు మాట్లాడను వెళితే లక్ష రూపాయలు ఇవ్వండే చేసుకోమన్నారట వాళ్ళు. అదేంటని మధ్యవర్తినడిగితే, అదేదో ఊరివాళ్ళు ఆ అబ్బాయికి అంతకట్నం ఇస్తామని వచ్చారట. కాకపోతే అమ్మాయి బాగాలేదని చేసుకోలేదట వీళ్ళు. అయితే తమకున్న డిమాండును తెలుసుకొని ఒక్కసారిగా రేటు పెంచేశారు. అందుకుపయోగడిందన్నమాట ఆ సంబంధం.

కట్నమే లక్ష రూపాయలయితే, ఆ పైన పెళ్ళి ఖర్చు మరో యాభై వేల దాకా అవుతుంది. కట్నం, ఖర్చు అన్నీ కలిపి లక్ష రూపాయలని అనుకున్న వాళ్ళకు ఇది స్థాయికి మించినదే అవుతుంది. పైగా మరో ఆడపిల్ల కూడా పెళ్ళికి సిద్ధంగా ఉంది.

'కట్నమెంతో మాట్లాడకుండా పెళ్ళి చూపులెందుకు ఏర్పాటు చేశారమ్మా! ఆ పిల్లెంత బాధపడుతుందో ఆలోచించారా!' అన్నయ్య అమ్మానాన్నలపై విరుచుకుపడ్డాడు.

'బాగుంది నాయనా! దాదాపు వాళ్ళ ఉద్దేశం మధ్యవర్తి ద్వారా కనుక్కున్నాం. జాతకాలు కలిసి, అమ్మాయి నచ్చితే కట్నం విషయంలో పెద్దగా పట్టుపట్టరనుకున్నాం. కానీ వాళ్ళిలా పిల్లకు కాక కట్నానికి ప్రాధాన్యతనిస్తారని మేమనుకున్నామా!' బాధపడ్డారు నాన్నగారు.

'ఎంత పిచ్చివారు నాన్నా మీరు. ఇప్పుడెంత కట్నం తీసుకుంటే అంత గొప్ప. సరే అయిందేదో అయిపోయింది. ఇకనైనా కచ్చితంగా వాళ్ళ ఉద్దేశమేమిటో

క్కని మరీ పెళ్ళి చూపులకు పిలవండి'.

ఇంట్లో అందరూ ముందు బాధపడ్డా, ఇదికాకపోతే మరొకటి అవుతుందని సమాధానం చెప్పుకున్నారు. యామికను ఓదార్చారు. పైకి స్థిమితంగా కనిపిస్తుందే కాని, యామిక మనసు చాలా గాయపడింది.

ముక్కూ మొహం తెలియని వాడి ముందు అలంకరించుకొని కూర్చుని, వారికి నచ్చినట్లనిపించగానే ఆశతో ఊహలలో తేలిపోయి, తర్వాత కేవలం కట్నం కోసం వారు కాదంటే ఏమీ జరగనట్లు మామూలైపోయి, తిరిగి పెళ్ళి చూపులకు రెడీ కావడం చాలా అవమానకరంగా, హాస్యాస్పదంగా అనిపించింది ఆమెకు. 'అతడికేం అనిపించదా! కేవలం ఆడపిల్లకేనా ఈ అనుభూతుల. ఆవేదనలూ, కానీ చెయ్యగలిగేదేముందీ! సమాజానికి ఎదురీదడం ఒక్కరివల్ల సాధ్యమవుతుందా! బహుశా నా నుదుట ఇలాగే రాసి ఉందేమో!' సగటు భారతదేశపు ఆడపిల్లలానే ఆలోచించింది యామిక.

మరో నెలలో మరో పెళ్ళిచూపుల తతంగం. ఈసారి కట్నం గురించి ముందుగానే ఎంక్వయిరీ చేసుకున్నారు. ఏమైనా మునపటి ఉత్సాహం కొరవడిందనే చెప్పాలి. ఈ పెళ్ళివాళ్ళు మూడు విడతలుగా పెళ్ళిచూపుల తతంగం జరిపారు. మొదటిసారి అబ్బాయి, తల్లిదండ్రులు, రెండోసారి అబ్బాయీ అతడి స్నేహితులు, మూడోసారి అతగాడి అక్కాబావలు. ఫొటోలో ఒరిజినాలిటీ తెలియ వారి నమ్మకమట.

ఈ చిరాకునంతా బలవంతంగా సహించింది యామిక. ఇంతచేసీ, అతడి అక్కా బావలకు ఆమె నచ్చలేదని కబురు. 'అక్కా బావలకు నచ్చుకుంటే పెళ్ళి చేసుకోనవుడు ముందుగా వాళ్ళనే చూడమనవలసింది కదా! ముందుగా వీళ్ళంతా ఎందుకు వచ్చినట్లు?' ఈసారి బాహాటంగానే విసుక్కుంది యామిక.

'డబ్బులకు అమ్ముడు పోయేది పెళ్ళికొడుకులు. సంతల్లో పశువుల్లా పరీక్షలను ఎదుర్కోవలసింది పెళ్ళికూతుళ్ళూనా? ఇదెక్కడి న్యాయం? ఎవరినడగాలి ఈ ప్రశ్న? బదులెవరిస్తారు?'

మూడో సంబంధం వాళ్ళు కట్నమూ సరిపోయిందీ. అమ్మాయి నచ్చిందీ, జాతకం ఇవ్వమన్నారు. జాతకం కుదరకుంటే ఎట్టి పరిస్థితిలోనూ చేసుకోరట. అదీ వారికి నమ్మకమున్న జ్యోతిష్యుడికే చూపాలట. ఈ సంబంధమైనా కుదరాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కుతూ జాతకమిచ్చారు. ఇంతవరకూ ఎవ్వరికీ కనిపించని దోషాలేవో కనబడ్డాయట ఆమె జాతకంలో వారి కుటుంబ జ్యోతిష్యుడికి. అది విని నివ్వెరపోయారు యామిక తల్లిదండ్రులు. వేరే జ్యోతిష్యులకు చూపించారు. ఎవ్వరూ వేలెట్టి చూపలేదు. దివ్యమైన జాతకమన్నారు. కానీ ఒప్పుకోలేదు పెళ్ళివారు. వారి జ్యోతిష్యుడి వాక్కే వారికి బ్రహ్మవాక్కట. ఈసారి బాధపడే బదులు ఆలోచనలో పడింది యామిక.

ఒక స్త్రీని ఇల్లాలుగా అర్హురాలో కాదో నిర్ణయించేది ఆమె చదువు-సంస్కారము, వ్యక్తిత్వము-వంశము, సౌందర్యము-సంప్రదాయము కాక జ్యోతిష్యుడు మారినప్పుడల్లా మారే జాతకచక్రం కావడం నిజంగా శోచనీయం.

ఈ సమాజంలో ఆడపిల్ల పెళ్ళి ఇంత జటిల సమస్యా? కాస్తో కూస్తో కట్నమివ్వగలిగే తమ పరిస్థితే ఇలా ఉంటే, మరి అసలు కట్నమే ఇవ్వలేని వారి సంగతేమిటి?

కన్యాశుల్కాన్ని నిషేధిస్తే, వరకట్నం దాని స్థానాన్ని ఆక్రమించింది. చట్టపరంగా వరకట్నమూ నిషేధమే అయినా ఆచరణలో అది మృగ్యం. ఒకవేళ ఆర్థిక పరిస్థితి బాగుండి ఆ అడ్డంకి దాటినా, జాతకాలంటూ ఈ చాదస్తపు కబంధహస్తం. మరి మన సమాజం ముందుకు పోతున్నట్లా? వెనక్కు పోతున్నట్లా? ఇది మన సంస్కృతిని మెరుగుపరిచినట్లా, మరుగుపరచినట్లా?

ఈ పెళ్ళిచూపుల ప్రహసనం నిరవధికంగా సాగిపోతూనే ఉంది. యాంత్రికంగా వచ్చేవారి ముందు కూర్చుంటుంది యామిక. ఫలితం తెలిసినదే కదా! ఆత్రుత ఎందుకు? ఆమె వయస్సు మాత్రం ఏ అడ్డంకికీ అందకుండా దూసుకుపోతోంది.

ఈ మధ్యకాలంలో వచ్చి తప్పిపోయిన సంబంధాలలో కొన్నిటికి కారణాలు అమ్మాయి ముదురుగా కనిపిస్తుందనో, ఏదైనా ఉద్యోగం చేస్తూంటే బాగుండేదనో! అమ్మాయి కన్నా ఆమె చెల్లెలైతే అభ్యంతరం లేదనో! ఇక కట్నం తక్కువనేది, జాతకాలు కుదరలేదనేది సర్వసాధారణ కారణాలు.

వీటికితోడు బంధుమిత్రుల, శ్రేయోభిలాషుల సానుభూతి వచనాలు. ఎక్కడికెళ్ళాలన్నా ఇదో పెద్ద తలనొప్పి. దాంతో శుభకార్యాలకు, బంధువుల ఇళ్ళకు వెళ్ళడం దాదాపు మానేసింది యామిక. ఎప్పుడైనా ఏ స్నేహితురాలినైనా కలవడానికి వెళితే, అక్కడ వాళ్ళ పరిస్థితీ అలాగే ఉండేది. రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్లయ్యేది.

ఈ సమస్యకు పరిష్కారమే లేదా? క్రమంగా తమకు పెళ్ళవుతుందనే ఆశను కోల్పోతున్నారంతా. మొత్తానికి స్నేహితురాళ్ళంతా ఏకకంఠంతో అసహ్యించుకునే తతంగం పెళ్ళిచూపులే.

అసలు పెళ్ళవుతుందనే నమ్మకమే లేనప్పుడు వచ్చిన ప్రతివారి ముందూ, అలంకరించుకొని ఆత్మవంచన చేసుకుంటూ కూర్చోవడం ఎంత హేయమైన విషయం.

తమ అలవాట్లు, తిరుగుళ్ళ విషయంలో ఏ మాత్రం తల్లిదండ్రుల జోక్యం సహించని మగవాళ్ళంతా ఏకమయ్యేది పెళ్ళి విషయంలో తల్లిదండ్రుల చాటున దాక్కోవడంలోనే.

పూజ్య వివేకానందులు, రామ్మోహనరాయ్, కందుకూరి, గురజాడ లాంటి భావ సంపదగల యువతకే దేశం గొడ్డు పోయిందా!

ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడే దేవతలు కొలువై ఉంటారని వక్కాణించిన దేశంలోనే స్త్రీ వ్యక్తిత్వానికి, మనోభావానికి విలువలేకుండా పోయింది. ఇది పురోగమనమా? తిరోగమనమా?

దాదాపు తన స్నేహితురాళ్ళంతా ఇలాగే ఆలోచిస్తున్నట్లు అర్థమైంది యామికకు. కాకపోతే సమాజపు కట్టుబాట్లను ఎదిరించే సాహసం చెయ్యలేకపోతున్నారెవ్వరూ. పెళ్ళికాని స్త్రీకి సమాజంలో రక్షణ లేకపోవడమే ఈ తలవంచడానికి ముఖ్య కారణం.

సమాజాన్ని ఎదిరించి తమ ఇష్టమైన వారిని పెళ్ళిచేసుకున్న అనేక మంది స్నేహితురాళ్ళ నేటి దుస్థితి మరో కారణం.

ఈ మధ్యకాలంలో ఎవరిని కలిసినా ఈ విషయం చర్చిస్తోంది యామిక. కొద్దిమంది పెళ్ళయిన వాళ్ళతో మాట్లాడినప్పుడు మరిన్ని విచిత్రమైన విషయాలు తెలిశాయామెకు. ముందుగా తనను చూచి అమ్మాయి బాగాలేదనో, జాతకం కుదరలేదనో చెప్పి, కట్నం పెంచగానే చేసుకుంటానంటే చేసేది లేక పెద్దవాళ్లను ఎదిరించలేక, మనసులో ఏర్పడ్డ అసహ్యాన్ని దాచుకొని ఆ వ్యక్తినే పెళ్ళి చేసుకొని సంసారాలు చేసేవాళ్ళు కూడా ఉన్నారట.

'అయ్యో! ఇంకా పెళ్ళికాలేదా?' అంటూ ఆడపిల్లను సానుభూతి పేరుతో పొడిచే ఇదే సమాజం వందల సంబంధాలు చూస్తూ వంకలు పెడుతూ ఏండ్ల తరబడి పెండ్లే చేసుకోకుండా ఉండిపోయే మగాడిని మాత్రం ఏమీ అనదు. ఎందుకని?

పెళ్ళి ఆడదానికే అవసరమా? మగాడికి అది లాభసాటి వ్యాపారమా! పెళ్ళివలన జీవితాంతం ఉండే తోడు లభించేట్లయితే అలాంటి తోడూనీడా మగాడికి కూడా అవసరమేగా! పిల్లల్ని కని వంశాన్ని నిలుపుకోవలసిన అవసరం కూడా మగాడిదేగా!

పెళ్ళి చేసుకోవడం వల్ల మగాడికి కట్నం రూపంలో ధనం రావడమే కాక బ్రతికినంత కాలం అదే లోకంగా దైవంగా భావించి, కనిపెంచిన వారిని తృణప్రాయంగా వదిలి అత్తగారింట్లో హారతి కర్పూరంలా కరిగిపోయే ప్రేమస్వరూపిణి అయిన స్త్రీ దొరుకుతుంది. తన ప్రాణాన్ని పణంగా పెట్టి, అతడిని తండ్రిని చేస్తుంది. అతడి కోసం అనుక్షణం తల్లడిల్లిపోతుంది. "భర్తనే గంధపుసానకు చేరువగా ఉండాలనే కోరికతో చివరంటా అరిగిపోయే శ్రీగంధపు చెక్కే స్త్రీ"

అయినప్పటికీ ఈ సమాజంలో పెళ్ళికోసం స్త్రీయే పురుషుడి కన్నా ఎక్కువగా తాపత్రయపడాల్సి వస్తోంది. సంఘం విధించే చట్రంలోంచి బయటకు రాకూడదనే స్త్రీ సంస్కారపు సహనానికి కట్టలు తెగిపోయే పరిస్థితి కల్పిస్తున్నారు.

"సమాజ నిర్మాణంలో అత్యంత కీలకపాత్ర వహించే స్త్రీగా తను ఈ పరిస్థితి ఎలా అరికట్టగలదు?" ఇలా ఆలోచిస్తూ మెల్లగా మగతలోకి జారుకుంది యామిక. అందులో ఓ దృశ్యం.

"అదో పెద్ద భవనం. నేటి సమాజాన్ని ప్రతిబింబిస్తూ దాన్నిండా పెళ్ళికాని ఆడపిల్లలు. కాని విచిత్రంగా వాళ్ళెవరూ దీనంగా దుఃఖిస్తూ ఏదో కోల్పోయినట్లుండక, స్థిరమనస్సులతో నిశ్శబ్దంగా రకరకాల కార్యకలాపాల్లో నిమగ్నమై వున్నారు. బిల్డింగు నిండా "మేం కట్నాలిచ్చి పెళ్ళి చేసుకోము" "బ్యాన్ ది డౌరీ" లాంటి స్లోగన్లున్న బ్యానర్లు తగిలించబడి ఉన్నాయి.

అలా కొంతకాలం గడిచేసరికల్లా బిల్డింగ్ ముందొక మగాడు దీనవదనంతో చేరాడు. ఎలాగైనా తనను ఎవరో ఒకరు పెళ్ళి చేసుకొమ్మని బ్రతిమాలసాగాడు. చూస్తుండగానే బిల్డింగ్ చుట్టూ ఒక్కరొక్కరుగా మగాళ్ళంతా నిండిపోయారు.

ఏ ఒక్కరి మొహంలోనూ డాంబికం లేదు. దీనమైన ముఖాలతో ఆడవాళ్ళను వేడుకొంటున్నారు.

ఠంగుమంటూ ఎక్కడో గంటమోగిన శబ్దానికి ఉలిక్కిపడిలేచింది యామిక. చెదిరిపోయిన ఆ కలలాంటి దృశ్యాన్ని మననం చేసుకుంటూ, తన కర్తవ్యమేమిటో స్ఫురించినట్లయి వడివడిగా బయలు దేరింది తన స్నేహితురాళ్ళను కలిసేందుకు. ◆

ఎన్నటికీ తెలుగువెలుగులే

రాసికన్నా వాసి ముఖ్యం అని వింటూ ఉంటాము. అలాంటి వాసి ఇందులో మనకు కన్పిస్తుంది. మనకు ఒక నాయకుని గురించిన వివరాలో, ఒక నటుడు లేదా కవిని గురించిన వివరాలో అనుకోకుండా అవసరం రావచ్చు. అప్పటికప్పుడే వివరాలు కావాలంటే మనం నానాతంటాలు పడాల్సి వస్తుంది. ఎక్కడెక్కడ దొరికే అవకాశముంటే అక్కడంతా వెతుకుతాము. అయితే మనకు సమగ్రమైన సమాచారం చాలా అరుదుగానే లభిస్తుంది. ఇంతా చేసి కొండను తవ్వి ఎలుకను తీసిన చందంగా అన్పిస్తుంది. ఏతావాతా మనం ఇవ్వాలనుకున్నంత సమాచారాన్ని ఇవ్వలేక పోతాము. ముఖ్యంగా పత్రికల్లో పనిచేసే వారికి ఇలాంటి పరిస్థితి వస్తూ వుంటుంది.

అయితే ఈ తెలుగువెలుగులు పుస్తకం మనకు ఆ లోటును తీర్చిందనే భావం మాత్రం కలిగిస్తుంది. ఒకే చోట పలు రంగాలకు చెందిన ప్రముఖుల జీవిత చరిత్ర ఒక్క పేజీలోనే కూర్చి పాఠకులకు అందించాలని చేసిన ప్రయత్నం చెప్పుకోదగ్గది. ఈ తెలుగు వెలుగులు అనే శీర్షికను అలనాటి ఆంధ్రసచిత్ర వారపత్రికలో 1959 నుంచి 1961 వరకూ 44 వారాల పాటు ధారావాహికగా ప్రచురించారు. అనేక రంగాలకు చెందిన 75 మంది ప్రముఖుల జీవితాలను గురించి ఇందులో విశ్లేషించారు. కేవలం వారి జీవితాల్లోని విజయాలను, గొప్ప విషయాలను మాత్రమే గాక వారిలోని లోటుపాట్లను, బలహీనతలను కూడా ఈ ఒక పేజీ విశ్లేషణల్లో పొందుపరిచారు. ఒక వ్యక్తి జీవితాన్ని ఒక్క పేజీలో కూర్చడమంటే ఎంతో ప్రజ్ఞ అంతకు మించిన ఓర్పు నేర్పు అవసరం.

వీటన్నింటినీ శివలెంక శంభుప్రసాద్, ముళ్ళపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు వంటి ఐదారుగురు రచించారు. అయినప్పటికీ వీటిని చదివినప్పుడు ఒక్కరే అన్నింటినీ రాశారనే భావన పాఠకునికి తప్పకుండా కలుగుతుంది. వీటన్నింటిలో వాడిన పదాలు, శైలి, భాష ఏక రూపంగా ఉంది. అందువల్ల పాఠకునికి ఎటువంటి వినుగు గాని, అసౌకర్యంగాని కలుగదు.

ఇన్ని సంవత్సరాల తరువాత వీటన్నింటినీ ఓపికగా సేకరించి ఒకే చోట పొందుపరచేందుకు చేసిన ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందించాల్సిందే. వీటన్నింటినీ పుస్తకరూపంలో తెచ్చిన మోనికా బుక్స్, హైదరాబాద్ వారిని అభినందించకుండా ఉండలేము. ఇది ప్రతి ఒక్కరూ ముఖ్యంగా తెలుగు దేశంలో పుట్టిన యువతీయువకులు తప్పకుండా చదవాల్సిన పుస్తకం. తెలుగు వెలుగులుగా భాసించిన వీరి సుదీర్ఘ జీవిత చరిత్రలను చదివే ఓపిక, తీరిక ఈ తరం వారికి ఎలాగూ లేదు. కనీసం రేఖామాత్రంగానైనా వారిని గురించి తెలుసుకొనే వీలు ఈ పుస్తకం వల్ల కలిగింది. ముచ్చటైన బాపూ బొమ్మలు పుస్తకానికి ఎంతో శోభనిచ్చాయి. ఇది ప్రతి ఒక్కరి గృహ గ్రంథాలయంలో ఉంచుకోదగిన పుస్తకం.

తెలుగు వెలుగులు
పబ్లిషర్సు : మోనికా బుక్స్;
వెల: రూ.85/-,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, ఇతర ప్రముఖ పుస్తక కేంద్రాలు.

- సింహాద్రి సరోజిని

ఆడవారిని అర్థం చేసుకోవడమెలా?

కలిసి జీవించే వ్యక్తుల మధ్య కలహాలూ సహజం. ఒకోసారి ద్వేషించేంతగా ప్రేమించడమూ, ప్రేమించేంతగా ద్వేషించడమూ ఉంటుంది. ఈ వైరుధ్యాలకు తరతరాలుగా స్త్రీ పురుషులకు సమాజంలో ఏర్పరచిన స్థానం, ఆ మేర ఒకరిపై ఒకరికి గల అవగాహన, ధోరణులు, ఆధిపత్యం ఒక ప్రధాన కారణం. దీంతోపాటు అభివృద్ధి చెందుతూ వస్తున్న వ్యక్తిత్వాల మధ్య ఘర్షణా కారణమవుతూనే ఉంటుంది. వీటితోపాటు జన్యుపరమైన ప్రేరణలూ కారణమని చెపుతుంది 'ఆడవారిని అర్థం చేసుకోవడమెలా?' అనే పుస్తకం. ప్రముఖ మనో విశ్లేషకులు, రచయిత అట్లూరి వెంకటేశ్వరరావు రాసిన ఈ పుస్తకంలో స్త్రీలకు సంబంధించి కాస్త ఎక్కువ చెప్పినప్పటికీ సమాంతరంగా పురుషుల ప్రవర్తన వెనుకగల జన్యుపర కారణాలనూ విశ్లేషించారు. ఏయే వైఖరులు, ధోరణులు, వర్తనలకు ఏ జన్యువులు కారణమవుతున్నాయో స్థూలంగానైనా వివరంగానే చెప్పారు.

భార్యా భర్తలమధ్య అవగాహనాలోపం ఏర్పడినపుడు వైవాహిక జీవితంలో అసంతృప్తి చోటుచేసుకుంటుంది. భర్తల ఆధిక్యతా ధోరణితో కొంతకాలం బలవంతపు రాజీ కుదిరినా సహనం, ఓర్పు నశించిన సందర్భాల్లో కుటుంబం ఛిన్నాభిన్నమై పోతుంది. మానవ సమాజ విస్తరణకు స్త్రీ పురుషుల మధ్య అవగాహనలతో కూడిన అనుబంధం, ఆ విధంగా అభివృద్ధయిన వ్యవస్థ అవసరం ఎంతో ఉంది. ఈ దశలో వారి మధ్య సాధారణంగా చోటు చేసుకునే అవగాహనా లోపానికి మూల కారణాలను తెలుసుకోవాలి. అవగాహన చేసుకున్న తర్వాత అనుగుణంగా వ్యవహరించాలి.

'స్త్రీ పురుషుల శరీర లక్షణాలు, శరీర ధర్మాలు వేరుగా ఉంటాయి. కాబట్టి ఆశలలోనూ, ఆకాంక్షలలోనూ వ్యత్యాసం సహజం. ఎదుటివారి దృక్కోణంనుంచి వారి ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి స్త్రీ పురుషులిద్దరూ కృషిచేయాల్సిన బాధ్యత ఉంది.' అదే ఆబ్జెక్టివిటీ అని రచయిత ఈ పుస్తకంలో చెపుతారు.

'తమ సుఖ సంతోషాలకోసం ఇతరులను నిందించడం వల్ల ప్రయోజనం లేదు. ఒకరి ప్రవర్తనపై రెండవవారి ప్రభావం, పరస్పర అవగాహన, అనుబంధం ద్వారానే రావాలని' రచయిత వివరించారు. ప్రవర్తనలోని లోపాన్ని ఎత్తిచూపే ముందు దాన్ని ఎలా స్వీకరిస్తారో ఒకసారి విజ్ఞతతో ఆలోచించాలి. ఆలుమగలు కీచులాడుకోవడం, తరచూ ఒకరినొకరు నిందించుకోవడం, కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం ఉద్రేక ఉద్వేగాలకు దారితీసి ఆరోగ్యం పాడుచేసుకునే ప్రమాదమూ ఉంది.

తమ అనుబంధం విచ్ఛిన్నం కాకుండా కాపాడుకోవడానికి స్త్రీ పురుషులిద్దరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలకోసం ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది. స్త్రీ పురుషులిద్దరూ చదవాల్సిన పుస్తకమిది.

ఆడవారిని అర్థం చేసుకోవడమెలా?
రచన : అట్లూరి వెంకటేశ్వరరావు,
వెల: రూ.45/-, **ప్రచురణ:** ఎ.వి.ఆర్. ఫౌండేషన్ (హైదరాబాద్), **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

- జి.విజయలక్ష్మి

నిల్చున్నాను. రెండు మంచాలను పట్టుకొని నడవడం కూడా ప్రారంభించాను."

సున్నితంగా ఉన్న చర్మం చాలా నొప్పిగా ఉండేదట. అయితే క్రమంగా అది మొద్దుబారిపోయి నడవడానికి వీలుగా మారింది. చాలా ఆశ్చర్యకరంగా ప్రతాప్ ఎంతో నైపుణ్యంతో తన నోరు, మొండిచేతులను ఉపయోగించి వస్తువులను పట్టుకోవడం ప్రారంభించారు. ఆయన మొండి చేతులు వేళ్ళులేని చేతుల్లా కదలడం ప్రారంభించాయి. ఆయన కంప్యూటర్ కీబోర్డును, కలాన్ని తేలికగా పట్టుకోగలరు. అతని మొండికాళ్ళు వెనక్కు వంగి పాదాలవలె పనిచేస్తున్నాయి.

నాలుగేళ్ళ క్రితం ప్రతాప్ ఒక చెప్పులు తయారుచేసే వ్యక్తి వద్ద రెండు రోజులు కూర్చొని తన చెప్పులను తానే రూపొందించుకొన్నారు. "నాకు కావలసిన పద్ధతిలో చెప్పులు తయారు చేయించుకోవడానికి నేను రెండు రోజులు చెప్పులు తయారుచేసే వ్యక్తి వద్ద కూర్చున్నాను. ముందుగా నాకు కావలసిన పద్ధతిలో చెప్పులు తయారు చేసే వ్యక్తిని పట్టుకోవడమే కష్టమయింది. అందరూ నాకు కావలసిన పద్ధతిలో చెప్పులు తయారు చేయడానికి తిరస్కరించారు."

ఎన్నడూ బడికి పోకుండానే, క్రమపద్ధతిలో చదువుకోకుండానే అతడు తొలుత పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. "నాకు కొన్ని తేలిక పదాలు మాత్రమే తెలును. అయినప్పటికీ ఆ పరీక్షలో పాసయ్యాను. అవయవాలన్నీ సక్రమంగా ఉండి, క్రమ పద్ధతిలో చదివిన వారనేక మంది తప్పుతున్నారు. కాబట్టి ఇది నాకు గొప్ప విజయం. నా జీవితంలో అత్యంత సంతోషదాయకమైన సమయమదే. పరీక్షలు రాసేందుకు బయటకు వెళ్ళిన ఆ ఆరు రోజులు నాకు పండగంటే నమ్మండి. నేను అంతకు ముందు ఇంటి నుంచి బయటకు వెళ్ళి ఎంతో కాలమయింది" అని ప్రతాప్ తెలిపారు.

అనంతరం ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బికాం, ఎంబిఏ పూర్తి చేశారు. ఎంబిఎ చదువు కోసం ఆయన నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఫర్ డిజేబుల్డ్ పీపుల్ (ఎన్‌సిపిఇడిపి) స్కాలర్‌షిప్ పొందారు. ఎంబిఏ పూర్తయిన అనంతరం ఉద్యోగం కోసం ఎంతగానో కష్టపడాల్సి వచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో నాలుగు పరీక్షలు, ప్రయివేటు రంగ సంస్థల్లో లెక్కలేనన్ని పరీక్షలు రాశారు. "నేను ధైర్యాన్ని కోల్పోయాను. ఇంటర్వ్యూ చేసేవారి ధోరణి చాలా నిరాశాజనకంగా వుండేది. అయితే అఖరికి ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం వచ్చింది.

సంపాదించడం ప్రారంభించగానే ఆయన పట్ల ఆయన తండ్రి వైఖరిలో చాలా మార్పు వచ్చింది. చిన్నతనం స్థానంలో గర్వం వచ్చింది. నిర్లక్ష్యం స్థానంలో శ్రద్ధ, వివక్ష స్థానంలో ప్రేమ ప్రవేశించాయి. ఈ విషయాలు చెప్పిన వెంటనే ప్రతాప్ ముఖంలో విషాదచ్ఛాయలు అలముకొన్నాయి. "మారిపోయిన నా తండ్రిని నేను కలుసుకోలేక పోయాను. నేను ఆగస్టులో ఉద్యోగంలో చేరాను. నేను ఆయనను కలుసుకోక ముందే అక్టోబరులో ఆయన చనిపోయారు. నా విజయం పట్ల ఆయన ఎంతగా గర్వించేవారో మా అమ్మ చెబుతూ వుంటుంది."



ప్రస్తుతం ప్రతాప్ నెలకు 11వేల రూపాయలు సంపాదిస్తున్నారు. నెలకు కొంత ఇంటికి కూడా పంపుతున్నారు. ఆయన మధ్యాహ్న భోజనం ఆఫీసులోనే చేస్తారు. రాత్రి భోజనం దగ్గరలోని హోటల్ నుంచి తెప్పించుకుంటారు. వంట పని మాత్రం ఆయన పెట్టుకోదలచ లేదు. వంట చెయ్యలేక కాదు. చేసుకోవడం ఇష్టంలేక



మాత్రమే. "వాళ్ళలాగా నేను పని మనిషి మీద ఆధారపడటం లేదు. ప్రతి పనీ నేను చేసుకుంటాను. బట్టలు ఉతకడం దగ్గర నుంచి ఇంటిని శుభ్రపరచుకోవడం వరకూ స్వయంగా నేనే చేసుకుంటాను. ఇతరుల సహాయం తీసుకోవడం నాకు ఇష్టం లేదు. బస్ ఎక్కేందుకు కూడా ఎవరి సహాయం తీసుకోవడం ఇష్టముండదు. నేనేదో కోల్పోయాననే భావన నాకు ఎన్నడూ లేదు. పూర్తిగా మామూలుగానే ఉన్నట్లు భావిస్తున్నాను."

23 ఏళ్ళుగా కాళ్ళూచేతులూ లేకపోయినా ఆయన ఎంతో ధైర్యాన్ని పెంచుకున్నారు. తాను మామూలుగా అవుతాననే దృఢసంకల్పం వల్లనే ఆయన వీటన్నింటినీ సాధించగలిగారు. ప్రస్తుతం ఢిల్లీలో పనిచేస్తున్న ప్రతాప్‌కు అహ్మదాబాద్‌లోని ఓఎన్‌జిసిలో ఇంకా మంచి ఉద్యోగం దొరకడంతో ఆయన అక్కడకు వెళ్లనున్నారు.

ప్రతాప్‌లాగానే ఇతర విధాలుగా వికలాంగులైన అస్లాం, అశ్వని వంటి అనేక మంది తమతమ రంగాలలో ఎంతగానో రాణిస్తున్నారు. ఐదేళ్ళ వయస్సు వరకూ మామూలుగానే చూడగలిగిన అశ్వనీ జస్వాల్‌కు క్రమంగా చూపు దూరమయింది. 26ఏళ్ల అశ్వని 17 సంవత్సరాలుగా పూర్తి అంధత్వంతో గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయన ఎం.ఫిల్. చేస్తున్నారు. ఆయన ఐదేళ్ళ వయస్సులో చూసిన వ్యక్తుల ముఖాలు గుర్తు లేవంటున్నారు. అయితే అప్పుడు తాను చూసిన రంగులన్నీ కళ్ళెదుటే వున్నాయంటున్నారు. నీలి రంగు తనకు చాలా ఇష్టమంటున్నారు. "నాకు వ్యక్తుల ముఖాలు గుర్తులేక పోవడం నిజంగా హాస్యాస్పదం. అయితే రంగులు, సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, నీటిలోని అలలు అన్నీ నాకు గుర్తే." ఢిల్లీ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్రం ప్రొఫెసర్ కావాలనేది ఆయన కోరిక.

ప్రస్తుతం ఎంసిఎ చదువుతున్న 24ఏళ్ళ అస్లాంకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే ఆకాంక్ష వుంది. ఆయనకు తన ఆరవ ఏట కాళ్ళు రెండూ పోయాయి. రైలు ఎక్కబోతుండగా జారి రైలు పట్టాల కింద పడిపోయి రెండుకాళ్ళూ నుజ్జునుజ్జయ్యాయి. తన పట్ల ఎవరైనా జాలి చూపడం అస్లాంకు నచ్చదు. "నాకు జాలి అవసరం లేదు. నాకు అవకాశమివ్వండి. నేను మీకు ఫలితాలనిస్తాను" అంటున్నాడు. శరీరానికి వైకల్యమున్నా మనస్సుకు వైకల్యం లేదని నిరూపించుకుంటున్న ఎందరో వికలాంగులు మనకు కన్పిస్తుంటారు. వారి పట్ల మనం చూపాల్సింది జాలి కాదు. వారి వారి రంగాలలో పైకి వెళ్లేందుకు చేయూత నివ్వగలిగితే వారు తమ వంతు సేవలను సమాజానికి అందించగలుగుతారు. ◆

చైతన్యం...

కొండబాబు

బహిరంగ సభ జరుగుతోంది. ముఖ్యమైన మంత్రిగారొకరు ప్రసంగిస్తున్నారు.

"అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని మనవి చేసుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికీ కృషి చేస్తానని విన్నవించుకుంటున్నాను. ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి. మీ కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాను. ఏవేవో సమస్యల పేరుతో కొందరు ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. అభివృద్ధిని చూడండి. ప్రతి దాంట్లో విమర్శలు చేసేవారున్నారు. పాజిటివ్‌గా చూడండి. ప్రజలు చైతన్యవంతులు కావాలి. రాజకీయం చేస్తే సహించేది లేదు. ఏం చేసినా... ఏం మాట్లాడినా కొందరు రాజకీయం చేస్తున్నారు. అభివృద్ధి తప్ప మరొక మాట లేదు... మీ జిల్లాను మోడల్ జిల్లాగా మారుస్తాను. మీరు మాత్రం చైతన్యవంతులు కావాలి. మంత్రి గారి ప్రసంగం సాగిపోతోంది. మధ్యమధ్యలో చప్పట్లు మోగుతున్నాయి.

* * *

ఎందుకంటే ఈ ప్రసంగాల్లోని మాటలు కొన్ని అర్థం కావు. అర్థమైనా మనకు తెలిసున్న అర్థాలు.., చూస్తున్న అర్థాలు వేర్వేరుగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిల నుండి జిల్లా స్థాయి వరకు వినబడే మాటలు ఇవి. పదేపదే ఇవే వినబడుతుంటాయి - ఏ కాంటెక్స్ట్‌లోనైనా

ఆ 'పలుకుబడు'ల సారాంశాన్ని, అర్థాలను తెలుసుకోవడం కూడా మనకు అవసరమే.

మనం ఈ ప్రసంగాల్లో తరచూ వినే కొన్ని 'పలుకుబడుల'ను పరిశీలిద్దాం.

ప్రజలంతా చైతన్యవంతులు కావాలి
పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
రాజకీయం చేయకండి
అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం
దోషాలు ఎంతటివారైనా వదిలిపెట్టం

మంత్రిగారి ప్రెస్ కాన్ఫరెన్స్ జరుగుతోంది.

"పని బియ్యం అవినీతికి సంబంధించి మీ ఎమ్మెల్యేగారి హస్తమున్నట్లు విమర్శలొస్తున్నాయి..." విలేకరి

"అవన్నీ అబద్ధం... ఆయన ఎలాంటి వారో అందరికీ తెలుసు. మా వాళ్ళు ఎలాంటి వారో ప్రజలకు తెలుసు"



"బియ్యం మాయమవటం నిజం కదా!"

"ఎంక్వైరీ చేస్తున్నాం... దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదు.. కచ్చితంగా శిక్షిస్తాం"

* * *

ఈ ప్రసంగాలు... ప్రెస్ కాన్ఫరెన్స్‌లు... మాటలు ఎవరికీ కొత్త కాదు.. కొన్ని దశాబ్దాలుగా..., కొన్నేళ్ళుగా వింటూనే ఉన్నాం. కాని 'పలుకుబడి'లో ఈ ప్రసంగాలు, ప్రెస్‌కాన్ఫరెన్స్‌ల ప్రస్తావనే వెంటనే సందేహం మాత్రం తప్పకుండా వస్తుంది. ఈ ప్రస్తావన అసందర్భమూ కాదు.., అనౌచిత్యమూ కాదు.

మహిళలు ముందుకు రావాలి... అలాంటి వాటిలో కొన్ని.

వీటిలో మొదటిదాన్నే తీసుకుందాం. 'ప్రజలందరూ చైతన్యవంతులు కావాలి'.. ఈ మాటను ఎవరూ కాదనరు. ప్రజలు కూడా. వారు కూడా చైతన్యులు కావడానికి సిద్ధంగానే ఉన్నారు. అయినా కావడం లేదా? కావడం 'లేదనుకునే' నాయకులు ఆ మాటను దశాబ్దాలుగా అంటున్నారనుకోవాలి. కాకపోతే కారణాలు ఏమిటని చూడకుండా పదే పదే పిలుపునిస్తే చైత్యవంతులయిపోతారా? ఆచరణాత్మకమైన కార్యక్రమాన్ని సామాజిక పరిస్థితులు కల్పించాలి. హేతుబద్ధతను, శాస్త్రీయతను నేర్పాలి. ప్రభావితం చేసే అంశాలేమిటో తెలియజేయాలి. అలా చేస్తున్నారా? అంటే లేదు. ఎందుకంటే ఈ పిలుపు ఇచ్చే అవకాశాన్ని కోల్పోతారు కాబట్టి. కోల్పోతే నష్టమేంటి?

ప్రజల పట్ల తమ 'చిత్తశుద్ధి'ని ప్రదర్శించే ఒక పిలుపును కోల్పోతారు కాబట్టి. అంటే, పని జరిగినా జరగకున్నా ప్రజల పట్ల చిత్తశుద్ధిని ప్రకటించే, ప్రదర్శించే పిలుపులు, మాటలు కొన్ని ఎప్పుడూ ఉంటుండాలి. వర్గ సమాజంలో పాలక వర్గానికి ఇలాంటి పిలువులు, పలుకుబడులు కొన్ని ఉంటాయి. ఆ మాటల వెనక ఉద్దేశాలూ ఉంటాయి. వర్గ పాలకుల మాటల వెనుక ఉద్దేశాలు ఉంటాయని కార్ల్‌మార్క్స్ కూడా చెప్పారు. ఈ పలుకుబడులూ అంతే. చైతన్యం అనే పదానికి ఉన్న అర్థం అవగాహన. అవగాహన నుంచి కొత్త ప్రశ్న, ఆలోచన జనించడంగా చెపుతారు.

కాని 'ప్రజలు చైతన్యవంతులు కావాలి' అని పదే పదే వినబడే పలుకుబడిలో ఆ పిలుపునిచ్చిన వారి అర్థం వేరు. చైతన్యం కావడమంటే 'మేము చాలా చేస్తున్నాం. మీకు చైతన్యం లేకే అవి అర్థం కావడం లేదు' అని చెప్పడం. పైగా ప్రజలు చైతన్యం కావడం తమకున్న ఏకైక వాంఛని చెప్పుకోవడమూనూ. ఇలాంటి పలుకుబడుల వెనకున్న పాలకవర్గ నీతిని అందరూ అవగాహన చేసుకోవాలి. ◆

పాఠక స్పందన

కళ్ళు చెమర్చిన వేళ

డిసెంబర్ 29 ఆదివారం అనుబంధంలో 'అమ్మ' అనే గేయం కళ్ళు చెమరింప చేసింది. అహర్నిశలు నా శ్రేయస్సే కాంక్షించి నా స్మృతి పథంలో చెరగని ముద్ర వేసి మొన్నటి 2002 నవంబర్22న ఆకస్మికంగా కనుమరుగైన నా జనని (అమ్మ) మళ్ళా ఈ గేయం ద్వారా ప్రత్యక్షమయింది.

తన బిడ్డడి కదలికాంతం కదలాడుతూనే ఉంటుంది 'అమ్మ'. అదే 'అమ్మ'కు సరైన నిర్వచనం. అమ్మకు అమ్మే సాటి. రచయితకు నా ధన్యవాదాలు.

– గుమ్మడవెల్లి భాస్కరరావు, వరంగల్

హ్యాపీ... హ్యాపీ న్యూఇయర్

2002కు వీడ్కోలును, 2003కు స్వాగత సంచికగాను వచ్చిన ఈ డిసెంబర్ 29 ఆదివారం అనుబంధం ఆసాంతం మంచి ఆసక్తి దాయకంగాను, విజ్ఞానాత్మకంగాను ఉంది. ఈ వారం కవర్ స్టోరీ 'హ్యాపీన్యూఇయర్' ద్వారా కొత్త సంవత్సర వేడుకల్ని ఆయా దేశాలలో ఏ విధంగా స్వాగతిస్తూ జరుపుకునేది ఆయా దేశాల వారీగా వివరిస్తూనే, వాస్తవానికి ఏ దేశంలోనూ ఈ వేడుకలు ఒకే సమయంలో జరగకుండా వేర్వేరు చోట్ల వేర్వేరు సమయాల్లో ప్రారంభమవుతుందంటూ వివరాలు తెలియజేసినందుకు కృతజ్ఞతలు. వాస్తవానికి మన దేశంలో కొత్త సంవత్సరం జనవరి 1 ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిసి ఎంతగానో ఆశ్చర్యపోయాము. ప్రత్యేకించి ఈ వారం మీరందించిన ఇయర్ రౌండప్ -2002 నిరుద్యోగులకు విజ్ఞానదాయకం. కార్టూన్ కదంబం కడుపుబ్బ నవ్వించింది.

– మాకిరెడ్డి సత్యనారాయణ, నిడదవోలు.